సాక్షి జగిత్యాల

సోమవారం, 24, జూలై, 2023



పోచమ్మకు వెండి కిరీటం

రాయికల్: మైతాపూర్ గ్రామానికి చెందిన నాగిరెడ్డి రఘుపతి–సౌమ్య దంపతులు పోచమ్మతల్లికి 13 తులాల వెండి కిరీటం బహూకరించారు.



వరద నీటిలో చేపలవేట

కథలాపూర్: వర్షాలతో జలకళ సంతరించుకున్న మేడిపెల్లి మండలం కొండాపూర్, కల్వకోట చెరువుల్లో చేపలవేట సాగుతోంది.

గరిష్టం/కనిష్టం

30.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

చిన్నారి ఔదార్యం



విరాళం అందిస్తున్న సాయిశ్రీహిత

జగిత్యాలటౌన్: పట్టణానికి చెందిన గుండు రామకృష్ణ – ప్రణవి దంపతుల కూతురు సాయిశ్రీహిత ఆదివారం స్థానిక వాల్మీకి ఆవాసానికి రూ.50వేల విరాళం అందజేసింది. తల్లిదండ్రులు ఇచ్చే ప్యాకెట్ మనీని పొదుపు చేసిన బాలిక.. ఆవాసంలోని పిల్లల కోసం తన పుట్టిన రోజు సందర్భంగా సాయం చేసింది. ఆవాసం కోశాధికారి ఎలగందుల కైలాసం, సభ్యులు ఎన్నమనేని అశోక్‌రావు, చిత్తారి మధుకర్, ప్రముఖ్ సుద్దాల మల్లేశం తదితరులు ఉన్నారు.

చిత్రకారుల సంఘం నూతన కార్యవర్గం

జగిత్యాలజోన్: పట్టణ చిత్రకారుల(ఆర్ట్స్ అండ్ రేడియం) సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విశ్వతేజ, ఉపాధ్యక్షుడిగా గాజుల రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా టి.సతీశ్, సహాయ కార్యదర్శిగా ఎండీ కరీం, కోశాధికారిగా భూసరాజు, ప్రచార కార్యదర్శులుగా రమేశ్, శ్యామ్ ఎన్నికయ్యారు.

చెరువుల గండ్లు పూడ్చాలి



గండిని పరిశీలిస్తున్న తుల ఉమ

కథలాపూర్(వేములవాడ): మేడిపెల్లి, బీమారం మండలాల్లోని చెరువులకు పడిన గండ్లు వెంటనే పూడ్చివేయాలని ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ డిమాండ్ చేశారు. బీమారం శివారులోని ఏనుగుకుంటకు పడిన గండిని ఆదివారం ఆమె పరిశీలించారు. రంగాపూర్ ప్రాజెక్టు మత్తడి నుంచి నీళ్లు లీకై వృథాగా పోతున్నాయని తెలిపారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. ఈ వర్షకాలంలో చెరువులు పూర్తిగా నిండకముందే మరమ్మతులు చేస్తే బాగుంటుందన్నారు. ఆమె వెంట మాజీ ఎంపీపీ పల్లి జమున, నాయకులు ఉన్నారు.

పాత పింఛన్ విధానమే ఉత్తమం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రాయికల్(జగిత్యాల): పాత పింఛన్ విధానం పునరుద్ధరిస్తేనే ఉద్యోగుల కుటుంబాలకు భద్రత ఉంటుందని తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాపర్తి నరసయ్య అన్నారు. ఆదివారం పాత పింఛన్ సాధన సంకల్పయాత్ర పోస్టర్‌ను పట్టణంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన ఉద్యోగులతో మాట్లాడారు. సీపీఎస్ రద్దు చేసి ఉద్యోగుల ఆకాంక్షను నెరవేర్చాలని ఆయన కోరారు. ఈ నెల 26న జగిత్యాలలో జరిగే పాత పింఛన్ సాధన సంకల్పయాత్రకు ఉద్యోగులు తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు వేల్పుల గంగరాజం, దొంతి సతీశ్, కండకుంట్ల అభయ్‌రాజ్, మాచర్ల మహేశ్, తాటిపాముల రమేశ్, అంతర్పుల గంగరాజం, ఉసకోల రాము పాల్గొన్నారు.

'మణిపూర్ దోషులను ఉరితీయాలి'

కొండగట్టు(చొప్పదండి): మణిపూర్ ఘటనకు కారకులైన దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కొత్తూరి స్వామి డిమాండ్ చేశారు. కొడిమ్యాలలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సభ్యసమాజం తలదించుకునేలా జరిగిన మణిపూర్ ఘటనలో ముగ్గురు మహిళలను అమానవీయంగా ఊరేగించడం, అత్యాచారం చేసి అందులో ఇద్దరిని హత్య చేయడం దుర్మార్గమన్నారు. దోషులను వెంటనే అరెస్ట్ చేసి ఉరి శిక్ష విధించాలని ఆయన కోరారు. బీజేపీ పాలిత రాష్ట్రమైన మణిపూర్‌లో రాజకీయ లబ్ధి కోసమే మత విద్వేషాలు రెచ్చగొట్టి అమాయక గిరిజన మహిళల మాన, ప్రాణాలు బలిగొంటున్నారని ధ్వజమెత్తారు. మే 4న జరిగిన సంఘటన ఇప్పటిదాకా బయటకు రాకుండా దాచిపెట్టారంటే.. దేశంలో ఏం జరుగుతుందో, ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో భారతీయులు గమనించాలని ఆయన కోరారు. ఈ ఘటనకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలే బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

అడ్డదారిలో కొలువులు

- అనుమతి లేకుండా నియామకాలు
- మున్సిపాలిటీలో అధికారుల నిర్వాకం
- భారీగా చేతులు మారుతున్న డబ్బులు
- చైర్‌పర్సన్ దృష్టికి వ్యవహారం
- అవుట్ సోర్సింగ్ సిబ్బందిని తొలగించాలని ఆదేశం



మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయం

మెట్‌పల్లి(కోరుట్ల): మెట్‌పల్లి మున్సిపాలిటీలో అవుట్ సోర్సింగ్ పద్ధతిన చేపడుతున్న సిబ్బంది నియామకాలు వివాదానికి దారితీస్తున్నాయి. అదనపు సిబ్బంది సేవలు అవసరమైతే.. నిబంధనల ప్రకారం ఉన్నతాధికారులు, పాలకవర్గం అనుమతి తీసుకున్నాక.. నియామకాలు చేపట్టాలి. కానీ, కొందరు అధికారులు ఇవేమీ పట్టించుకోకుండా గుట్టుచప్పుడు కాకుండా నియామకాలు చేపట్టడం విమర్శలకు తావిస్తోంది. అడ్డదారిలో చేపడుతున్న నియమాకాల విషయంలో పెద్దఎత్తున డబ్బులు చేతులు మారుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. ఇటీవల కొందరిని అనుమతిలేకుండా పనిలోకి తీసుకున్న విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత.. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధిలేక అవుట్ సోర్సింగ్ సిబ్బందిని తొలగించాలని నిర్ణయించడం గమనార్హం.

అవసరానికి మించి సిబ్బంది నియామకం

- బల్దియాలో 26వార్డులు ఉండగా, సుమారు 60వేలకు పైగానే జనాభా ఉంది.
- కాంట్రాక్ట్, ఫిక్స్‌డ్‌పే, అవుట్ సోర్సింగ్ పద్ధతిన 226 మంది సిబ్బంది పనిచేస్తున్నారు.
- ఉన్నజనాభా ప్రకారం మున్సిపాలిటీలో 150 మందిలోపు మాత్రమే అవుట్ సోర్సింగ్ సిబ్బందిని నియమించాల్సి ఉంది.
- కానీ, ప్రస్తుతం బల్దియాలో 180 మంది సిబ్బంది వరకు ఉన్నారు.
- ఇందులో 100మంది పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తుండగా, మిగతా సిబ్బంది వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారు.
- వీరిలో కొందరు నామమాత్రంగానే విధులు నిర్వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.
- మొత్తం సిబ్బందికి ప్రతినెలా వేతనాల కింద రూ.40లక్షల వరకు వెచ్చిస్తున్నారు.
- మున్సిపల్ ఆదాయం దృష్ట్యా వేతనాల చెల్లింపు విషయంలో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి.
- తరచూ వేతనాల చెల్లింపులు సకాలంలో జరగక కార్మికులు ఇబ్బంది పడుతున్నారు.

అధికారుల తీరుపై ఆగ్రహం

ఇప్పటికే అవసరానికి మించి సిబ్బంది ఉన్నారనే ఆరోపణలు వ్యక్తమవుతుంటే.. ఇటీవల కొందరు అధికారులు పాలకవర్గాన్ని సంప్రదించకుండా మరికొందరు సిబ్బందిని నియమించడం వివాదానికి దారితీసింది. ముఖ్యంగా ఇతర మండలానికి చెందిన ఇద్దరిని గుట్టుగా నియమించారు. దీనివెనుక ఓ ఉద్యోగి పాత్ర ఉన్నట్లు తెలిసింది. ఆయన ఒత్తిడితోనే పాలకవర్గం, ఉన్నతాధికారుల అనుమతి లేకుండా నియమించినట్లు తెలిసింది. ఈ విషయంలో భారీగానే డబ్బులు చేతులు మారాయనే ప్రచారం జరుగుతోంది. కొందరు దీనిని చైర్‌పర్సన్ సుజాత దృష్టికి తీసుకుపోగా, ఆమె అధికారులను నిలదీశారు. తమను సంప్రదించకుండా నియమించడంపై మండిపడ్డారు. వెంటనే వారిని విధుల నుంచి తొలగించాలని ఆదేశించారు. ప్రస్తుతం ఈ వ్యవహారం మున్సిపల్‌లో చర్చనీయాంశమైంది.

> **పక్కన పెట్టాం**
>
> 
>
> అనుమతి లేకుండా నియమించిన సిబ్బందిని విధుల్లోంచి తొలగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆదేశించారు. ప్రస్తుతానికి ఇద్దరిని పక్కన పెట్టాం. ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. అవసరం మేరకే సిబ్బంది నియమాకాలు చేపడుతున్నాం. అంతకు మించి విధుల్లోకి ఎవరినీ తీసుకోవడం లేదు.
>
> – జగదీశ్వర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్, మెట్‌పల్లి

జేపీఎస్‌ల క్రమబద్ధీకరణకు

మార్గదర్శకాలు



లక్ష్మీపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం

- పనితీరు ఆధారంగా మార్కులు
- జిల్లాలో 281 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

జగిత్యాలరూరల్: నాలుగేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న జిల్లాలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ప్రభుత్వ హామీ నేపథ్యంలో క్రమబద్ధీకరణకు ఇటీవల మార్గదర్శకాలు జారీచేసింది. జేపీఎస్‌ల పనితీరును మూల్యాంకనం చేసేందుకు జిల్లాలో ప్రత్యేకంగా కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ కమిటీల్లో ఎంపీడీవోలు, ఎంపీవోలు, అటవీశాఖ రేంజ్ అధికారి, వ్యవసాయాధికారి, ఏపీవోలు ఉన్నారు. వీరు గ్రామాల్లో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన పనులు పరిశీలిస్తున్నారు. వాటి ఆధారంగా ఎవాల్యుయేషన్ యాప్‌లో మార్కులు నమోదు చేస్తున్నారు.

జిల్లాలో 183 మంది..

- జిల్లాలో 380 గ్రామపంచాయతీలు ఉండగా, అందులో 281 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పనిచేస్తున్నారు.
- వీరిలో 183 మంది పంచాయతీ కార్యదర్శులు 4ఏళ్ల సర్వీస్ పూర్తిచేసుకున్నారు.
- వీరి పనితీరు ఆధారంగా అధికారులు అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని క్రమబద్ధీకరణకు నివేదిక సిద్ధం చేస్తున్నారు.

8 అంశాల ఆధారంగా ఎంపిక..

గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి ప్రభుత్వం 8 అంశాల ఆధారంగా మార్కులు కేటాయించాలని సూచించింది. దీంతో వారు చేసిన పనులు అంచనా వేసి, మూల్యాంకనం చేస్తూ మార్కులు కేటాయిస్తున్నారు. వీటిని ఎవాల్యుయేషన్ యాప్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారు. మౌలిక సదుపాయాలు, వందశాతం పన్ను వసూలు, నర్సరీల నిర్వహణ, మొక్కల సంరక్షణ, విద్యుత్ బిల్లుల వసూలు, ట్రాక్టర్ నెలవారీ వాయిదాల చెల్లింపులు, 10 శాతం గ్రీన్‌బడ్జెట్ వినియోగం, ఇంటింటా చెత్త సేకరణ, త్వరితగతిన జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ.. వంటి 8 అంశాలల్లో వంద మార్కులతో పనితీరు అంచనా వేస్తున్నారు.

నెలరోజుల్లోగా పూర్తి..

పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ ప్రక్రియను నెలరోజుల్లో పూర్తిచేయాలని అధికారులు మండలస్థాయి కమిటీలను ఆదేశించారు. దీంతో పంచాయతీ కార్యదర్శుల పనితీరును రోజువారీగా పర్యవేక్షిస్తూ నివేదికలు సిద్ధం చేస్తున్నారు.

> **నివేదిక సిద్ధం చేస్తున్నాం**
>
> ప్రభుత్వ ఆదేశాల మేరకు.. జిల్లాలో నాలుగేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న 183 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పనితీరు అంచనా వేస్తున్నాం. ఈ ప్రక్రియలో ఇప్పటికే మండల కమిటీలు నివేదిక సిద్ధం చేశాయి. వాటిని జిల్లా కమిటీకి అప్పగిస్తున్నాయి. తుది నివేదికను ప్రభుత్వానికి అందజేసేందుకు సిద్ధం అవుతున్నాం.
>
> – దేవరాజు, జిల్లా పంచాయతీ అధికారి

అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయం



మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

- సాంఘిక సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి: అన్నివర్గాల అభ్యున్నతే రాష్ట్రప్రభుత్వ ధ్యేయమని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. పట్టణంలోని ఎస్‌హెచ్ గార్డెన్‌లో ఆదివారం నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కొప్పుల ఈశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ బీసీలతో పాటు మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వ రూ.లక్షల్లో సాయం చేస్తోందన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా జీవో జారీచేందని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనిసంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్నారని చెప్పారు. రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే మరిన్ని పథకాలు ప్రవేశ పెడతారని పేర్కొన్నారు. మైనార్టీలకు గ్రాంట్ అందించడం.. ముస్లిం మైనార్టీ శాఖ మంత్రిగా ఉండడం తనకెంతో ఆనందంగా ఉందని అన్నారు. మైనారిటీ విద్యార్థులకు నాణ్యమైన, ఉచిత విద్య అందించేందుకు రాష్ట్రంలో 204 గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రికే దక్కిందని చెప్పారు. వాటికోసం రూ.2,200 కోట్లు బడ్జెట్‌లో ప్రతిపాదించారని వివరించారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ అధ్యక్షులు, ప్రధానకార్యదర్శులు, ఉపాధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలోనే ఆలయాల అభివృద్ధి

సారంగాపూర్(జగిత్యాల): సీఎం కేసీఆర్ హయాంలోనే ఆలయాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. పెంబట్ల గ్రామంలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో చేపట్టిన శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు. చేశారు. దీనికి సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను ఆర్యవైశ్యులకు అందజేశారు. సారంగాపూర్ దుబ్బరాజన్న ఆలయ అభివృద్ధికి రూ.85 లక్షలు, బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయానికి రూ.38 లక్షలు, కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించడం గొప్పవిషయమన్నారు. అనంతరం 24 మంది లబ్ధిదారులకు రూ.7.50 లక్షల సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గోలి శ్రీనివాస్, జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సొల్లు సురేందర్, సింగిల్‌విండో చైర్మన్ గుర్నాథం మల్లారెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గుర్రాల రాజేందర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి కన్వీనర్ కోల శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘం ఉమ్మడి మండల అధ్యక్షులు మర్యాల రాజన్న, పాత రమేశ్, ఎలగందుల అశోక్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

షటిల్ కోర్టు ప్రారంభం

జగిత్యాలటౌన్: స్థానిక మినీస్టేడియంలో రూ.36 లక్షలు వెచ్చించి నిర్మించిన ఉడెన్ ఫ్లోరింగ్ షటిల్ కోర్టును ఎమ్మెల్యే సంజయ్ ప్రారంభించారు. బల్దియా చైర్‌పర్సన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ నరేశ్, డీఈ రాజేశ్వర్, కౌన్సిలర్ చుక్క నవీన్, నాయకుడు ఒల్లెం మల్లేశం ఉన్నారు. పద్మనాయక కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన 30 కేవీ సామర్థ్యంగల సోలార్ సిస్టంను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉపకారవేతనాలు అందజేశారు. వెంకటేశ్వర్‌రావు, వేణు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి అభినందన

బాస్కెట్‌బాల్‌లో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచిన జగిత్యాలకు చెందిన సంజనను ఎమ్మెల్యే సంజయ్ అభినందించారు. వచ్చే ఆగస్టులో పాండిచ్చేరిలో జరిగే జాతీయస్థాయి పోటీలకు సంజన అర్హత సాధించిందని తెలిపారు. ఆమెను శాలువాతో సత్కరించారు.



సంజనను అభినందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

25 నుంచి నిరసనలు



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: ఉపాధ్యాయ, విద్యారంగంలోని సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉద్యమ కార్యాచరణ రూపొందించినట్లు తపస్ జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పురాతన ఉన్నత పాఠశాలలో ఉద్యమ జాగరణ కరపత్రాన్ని ఆవిష్కరించారు. దేవయ్య మాట్లాడుతూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈనెల 25న జిల్లాలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన చేపడతామన్నారు. ఈనెల 31న రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల ఎదుట, ఆగస్టు 5న కలెక్టరేట్ ఎదుట ధర్నాలు చేస్తామని చెప్పారు. ఆగస్టు 19న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. పాత పింఛన్ పునరుద్ధరణ, పదోన్నతులు, బదిలీలు, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర సహ అధ్యక్షుడు అయిల్నేని నరేందర్‌రావు, రాష్ట్ర బాధ్యులు ఒడ్నాల రాజశేఖర్, జిల్లా బాధ్యులు ప్రదీప్‌కుమార్, గడ్డం మహిపాల్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, కూర్మాచలం రఘునందన్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు పనులు వేగవంతం చేయాలి

కోరుట్ల: పట్టణంలోని గోదాం రోడ్డులో దెబ్బతిన్న కల్వర్టును ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఆదివారం పరిశీలించారు. కాగా, మిషన్ భగీరథ పైప్‌లైన్ నిర్మాణం కోసం కల్వర్టు ధ్వంసం చేశారు. కొంతకాలంగా అలాగే వదిలేశారు. ప్రయాణికులు, వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈవిషయం తెలియడంతో ఎమ్మెల్యే కల్వర్టు పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మెట్‌పల్లి: డీఎస్సీ–2003 ఉపాధ్యాయులకు ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేలా చొరవ తీసుకోవాలని పీఆర్‌టీయూ గౌరవ అధ్యక్షుడు, మాజీఎమ్మెల్సీ జనార్దన్‌రెడ్డికి యూనియన్ జిల్లా నాయకులు వినతిపత్రం అందించారు. హైదరాబాద్‌లో ఆదివారం యూనియన్ సమావేశం నిర్వహించగా ఉపాధ్యాయుల ఇబ్బందులను వివరించి పాత పెన్షన్ విధానం వర్తింపజేసేలా చూడాలని ఆయనను కోరారు. కార్యక్రమంలో పులిపాక కిషన్, కనకపురం రవీందర్, గాదె నర్సింగరావు ఉన్నారు.

బియ్యం పంపిణీని వేగవంతం చేయండి

జగిత్యాలటౌన్: రేషన్ బియ్యం పంపిణీలో ఆలస్యం కావడంతో పేదలు ఆందోళన చెందుతున్నారని, పంపిణీప్రక్రియను వేగవంతం చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జూలై ప్రారంభమై 20 రోజులు గడుస్తున్నా పూర్తిస్థాయిలో రేషన్ షాపులకు బియ్యం చేరలేదన్నారు. ఇందుకు బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. నిరుపేదల ఆకలి తీర్చేరేషన్ బియ్యంపంపిణీని ప్రథమ ప్రాధాన్యతగా పరి గణించాల్సిన పౌరసరఫరాల అధికారుల నిర్లక్ష్యం ప్రదర్శించడం సరికాదన్నారు. మిల్లర్లు సీఎంఆర్ ఇవ్వకపోవడంతో రేషన్ బియ్యం పంపిణీ ఆలస్యమవుతుందా? లేక అధికారుల అలసత్వమా? అనే విషయాలపై ఉన్నతాధికారులు విచారణ జరపాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

భగవద్గీతపై ప్రచారం



ప్రచారం చేస్తున్న సభ్యులు

ధర్మపురి:కమలాపూర్ గ్రామంలో ఆదివారం భవగద్గీత గ్రంథాలపై ప్రచారం చేశారు. లోక కల్యాణార్థం త్రైత సిద్ధాంత గ్రంథాలు, జ్ఞాన ధర్మ ప్రచారం విస్తృతంగా చేపట్టారు. ఆషాఢ మాసంలో వచ్చే గురుపౌర్ణమి సందర్భంగా జిల్లా త్రైత సిద్ధాంతకర్త యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో లక్సెట్టిపేట, కొడిమ్యాల సేవాసమితి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. భగవద్గీత గ్రంథాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో సేవాసమితి సభ్యులు ఆర్.రాజు, రాకేశ్, ఎం.రాజు, విక్రమ్‌దీక్షిత్, సునీత, రవళి, స్వాతి, ఉమ, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

ఈద్గాకు స్థలం కేటాయించాలని వినతి

కోరుట్ల: పట్టణంలో ఈద్గా కోసం మూడు ఎకరాలు కేటాయించాలని జమాతే అహ్లేహదీస్ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర రావుకు వినతిపత్రం సమర్పించారు. జమాతే అహ్లేహదీస్ సభ్యులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యాసాగర్‌రావును కలిశారు. తాఉ సుమారు 3,000మంది సభ్యులు ఉన్నామని, సమీప గ్రామాల ప్రజలు కూడా ఇక్కడికే వస్తారని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు మమమ్మద్ మహమూద్ అలీ, షేక్ యూసుఫ్, ఎంఏ జావిద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

జగిత్యాలక్రైం: స్థానిక కొత్తబస్టాండ్ సమీపంలోని శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో శనివారం అర్ధరాత్రి దొంగలు రెండు హుండీలు పగులగొట్టి, నగదు ఎత్తుకెళ్లారు. పూజల అనంతరం ఆలయ పూజారి గుడికి తాళాలు వేసి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం పూజారి వచ్చేసరికి గుడి తాళాలు పగులగొట్టి ఉండడం చూశాడు. రెండు హుండీలు పగులగొట్టి ఉండడం, అందులోని సుమారు రూ.30వేలు అపహరించారని గుర్తించాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సీసీ ఫుటేజీలు పరిశీలించారు. ఆలయ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

అస్తవ్యస్తంగా పారిశుధ్యం

- దర్శనమిస్తున్న పిచ్చిమొక్కలు, ఖాళీస్థలాలు
- కానరాని స్ప్రే యంత్రాలు
- ఎక్కడి పనులు అక్కడే
- పట్టించుకోని అధికారులు

ఇదీ ఇస్లాంపుర కాలనీలోని చింతకుంట చెరువు సమీపంలోని ఏరియా. దీనిపక్కన పెద్ద నాలా ఉంది. దీనిని ఆనుకుని చాలా ఇళ్లు ఉన్నాయి. పిచ్చిమొక్కలు తొలగించకపోవడంతో సమీపంలోని ఇళ్లలోని ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పిచ్చి మొక్కలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఇదీ విద్యానగర్‌కాలనీ. అసలు బిల్డింగ్‌లు కనిపించనంతగా పిచ్చిమొక్కలు పెరిగాయి. కురిసిన వర్షాలకు అందులో నీరునిలిచి దోమలు, పందులు, కుక్కలు విపరీతంగా విజృంభిస్తున్నాయి. స్థానికులు బిక్కుబిక్కు మంటూ కాలం గడుపుతున్నారు. రోగాలు ముసిరే అవకాశం ఉన్నప్పటికీ అధికారులు శ్రద్ధచూపడం లేదు.



ఇదీ విద్యానగర్ శ్రద్ధ ఆస్పత్రి సమీపంలోని ఇళ్ల మధ్యనున్న మురుగునీరు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. అసలు డ్రైయినేజీలు కూడా కన్పించడం లేదు. మురుగునీరు బయటికి వెళ్లేందుకు దారిలేక అక్కడే నిలుస్తోంది. దీంతో మురుగువాసన సమీపంలోని ఇళ్లలోకి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిచ్చిమొక్కలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు.



ఇదీ విజయపురి కాలనీ ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలతో అడవిని తలపిస్తోంది. ఇక్కడ నివసించే పరిస్థితి లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఓవైపు వర్షం మరోవైపు మురుగునీరు పొంగి ఇళ్లలోకి వస్తుండడంతో ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి పిచ్చిమొక్కలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



నోటీసులు జారీ చేశాం

ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు అధికంగా ఉన్న మాటవాస్తవమే. యజమానులకు నోటీసులు జారీచేశాం. వాటిని తొలగించకపోతే మేమే చర్యలు తీసుకుని జరిమానాలు విధిస్తాం. ఫాగింగ్ సైతం చేపడతాం. వర్షాభావంతో కొద్దిగా ఇబ్బందిగా ఉంది. భారీ వర్షాలతో చెట్లు, డ్రెయినేజీలన్నీ అస్తవ్యస్తంగా ఉన్నాయి. పూర్తిస్థాయిలో పారిశుధ్యం చేపడుతున్నాం.

– బాల ఎల్లం, శానిటరీ ఇన్‌స్పెక్టర్

జగిత్యాల: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జగిత్యాల మున్సిపాలిటీ ప్రాంతంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. డ్రెయినేజీల నిర్మాణం సక్రమంగా లేక వర్షాలకు డ్రెయినేజీలు పొంగి పొర్లుతున్నాయి. దీనికి తోడు డ్రెయినేజీలను శుభ్రం చేయకపోవడం, నిత్యం పూడిక తీయకపోవడంతో పూర్తిగా అవినిండి మురుగునీరంతా రోడ్లపైకి, ఇళ్లలోకి చేరుతోంది. నిత్యం షిల్ట్ తీయకపోవడంతో ప్లాస్టిక్ వ్యర్థాలతో డ్రెయినేజీలు నిండి కాలనీలు, రోడ్లవెంట వెళ్తుంటే దుర్గంధం వెదజల్లుతోంది. పట్టణ ప్రగతిలో భాగంగా పిచ్చిమొక్కలు, డ్రెయినేజీలు శుభ్రం చేసినప్పటికీ డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో సమస్యకు పరిష్కారం కానరావడం లేదు. కాలనీల్లో చాలాచోట్ల పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి అడవిని తలపిస్తుండడంతో పట్టణ ప్రజలు, స్థానికులు, కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు.

నత్తనడకన పనులు...

భారీ వర్షాలకు చెట్లు విరిగి, డ్రెయినేజీల్లోకి ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తచేరడంతో వీటిని తొలగించేందుకు అధికారులు నత్తనడకన పనులు చేస్తున్నారు. ఖాళీస్థలాల్లోని పిచ్చిమొక్కలను తొలగించడం లేదని, దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయడం లేదని, డ్రెయినేజీలు సైతం తీయడం లేదని స్థానికులు, కాలనీవాసులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సిబ్బందితో పనులు చేయించి పారిశుధ్యం మెరుగుపర్చాలని కలెక్టర్ ఆదేశించినా అది ఎక్కడా కనిపించడం లేదు. ఎక్కడ చూసినా ఖాళీ ప్రదేశాల్లో పిచ్చిమొక్కలు, నిలిచిన నీరే తప్ప తొలగించిన దాఖలాలు లేవు. జిల్లా కేంద్రంలోని విద్యానగర్, తులసీనగర్, బైపాస్‌రోడ్, గోవిందులపల్లి, ఇస్లాంపుర, గాంధీనగర్, ఉప్పరిపేట, రవీంద్రనాథ్‌ఠాగూర్, అరవింద్‌నగర్, జాంబాగ్‌తో పాటు శివారు కాలనీల్లో ఖాళీ స్థలాలు అత్యధికంగా ఉండడంతో అందులో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి దట్టంగా మారాయి. వాటిని తొలగించాలని ప్లాట్ యజమానులకు నోటీసులు జారీచేసి చర్యలు తీసుకోవాలని నిబంధనలు ఉన్నా పట్టించుకునే వారు లేకుండా పోయారు. మున్సిపల్ అధికారులు సైతం నోటీసులు జారీచేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. నిబంధనల ప్రకారం ఖాళీ స్థలాల్లో చెత్తగానీ, పిచ్చిమొక్కలు గానీ యజమానులు తీయకపోతే సదరు మున్సిపాలిటీ వారే వాటిని తొలగించి వారికి జరిమానా విధిస్తారు. కానీ ఇదీ అమలుకు నోచుకోవడం లేదు. మున్సిపల్ అధికారులు సైతం పట్టించుకోవడం లేదు.

ఖాళీ స్థలాలతోనే ఇబ్బంది:

జగిత్యాల:
వార్డులు : 48
జనాభా : 1,20,357
సిబ్బంది : 296

మున్సిపాలిటిలో ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉండడంతో పాటు ఇంటి స్థల యజ మానులు పట్టించుకోకపోవడంతో ఏపుగా, దట్టంగా పిచ్చిమొక్కలు పెరిగి విషపురుగుల, పాములు చుట్టుపక్కల ఇళ్లకు చేరడంతో పాటు దోమలు, ఈగలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీంతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి రోగాల బారిన పడుతున్నారు. ఖాళీస్థలాలు, మురుగునీటి ప్రాంతాలు, డ్రెయినేజీల్లో ఆయిల్ బాల్స్ వేయడం, ఫాగింగ్ చేయడం లేదనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఖాళీ స్థలాల్లోని పిచ్చిమొక్కలు తొలగించాలని పక్కా ప్రణాళికతో డ్రెయినేజీలు ఏర్పాటు చేస్తే మురుగునీరు బయటికి వెళ్లి ఇబ్బందులు తప్పుతాయని పారిశుధ్య సమస్య ఉండదని అంటున్నారు.

విషపురుగులు, సర్పాలతో సహవాసం..

ఒకవైపు దోమలు విజృంభిస్తుండడంతో పాటు విషపురుగులు, సర్పాలు సంచరిస్తున్నాయని, ఇళ్లలోకి వస్తున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్యం నిర్వహణకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ అధికారు లు చెబుతున్నప్పటికీ 48 వార్డులో మాత్రం అవేమి కనిపించడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.

ఆస్ట్రేలియాలో మంత్రి కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు

రాయికల్(జగిత్యాల): ఎన్నారై బీఆర్ఎస్ ఆస్ట్రేలియా ఆధ్వర్యంలో ఐటీ పురుపాల శాఖ మంత్రి, టీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు పుట్టినరోజు వేడుకలను మెల్‌బోర్న్‌లో ఘనంగా నిర్వహించారు. అనిల్ బైరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఆస్ట్రేలియాలో స్థిరపడిన పంజాబ్, గుజరాత్ కమ్యూనిటీ నాయకులు పాల్గొన్నారు. కేటీఆర్ చేస్తున్న అభివృద్ధి ద్వారా తెలంగాణలో ఐటీ రంగం గొప్పగా ముందుకు వెళ్తోందని వారు కితాబిచ్చారు. బీఆర్ఎస్ జాతీయ పార్టీ రానున్న ఎన్నికల్లో కొత్త చరిత్ర సృష్టించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రమేశ్, మధు పైల, మధు పార్స, రవీందర్ చుక్క, శ్రవణ్, కుల్వీందర్, పరమేందర్‌సింగ్, హిమాన్షు పటేల్, హరీశ్ రెడ్డి, కార్తీక్, అవినాశ్, దిలీప్‌రెడ్డి, వంశీ, ప్రశాంత్, సాయి, సందీప్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.



వేడుకలు నిర్వహిస్తున్న ఎన్ఆర్ఐలు

‘జీవన్‌రెడ్డిని విమర్శించే నైతికహక్కు లేదు’

ధర్మపురి: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని విమర్శించే నైతిక హక్కు ఎవరికీ లేదని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. పట్టణంలోని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం వారు పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. కొందరు చోటామోటా నాయకులు జీవన్‌రెడ్డిపై అనవసర ఆరోపణలు చేశారన్నారు. ఎల్ఎం కొప్పుల ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన సేవా కార్యక్రమాలకు కాంగ్రెస్ ఎప్పుడూ వ్యతిరేకం కాదని, జీవన్‌రెడ్డి మాట్లాడింది ఏంటో ఒక్కసారి సమీక్షించుకోవాలని సూచించారు. ఎమ్మెల్సీ హోదాలో ఉన్న జీవన్‌రెడ్డిపై ఒకమంత్రి అనవసర విమర్శలు చేయడం సరికాదన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. పోలీస్‌శాఖతో కలిసి జాబ్‌మేళా నిర్వహించడం ఏమిటని జీవన్‌రెడ్డి ప్రశించారని.. అంతే గానీ.. అర్థంలేకుండా ఏమీ మాట్లాడలేదన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎస్.దినేశ్, వేముల రాజేశ్, సింహరాజు ప్రసాద్, సీపతి సత్యనారాయణ, చిలుముల లక్ష్మణ్, అశెట్టి శ్రీనివాస్, వొజ్జల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బీజేపీలో చేరికలు

కోరుట్ల: పట్టణంలోని 32వ వార్డుకు చెందిన వివిధ పార్టీల నాయకులు, యువజన సంఘాల కార్యకర్తలు, పలువురు మహిళలు సుమారు వంద మంది బీజేపీలో చేరారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్ ఆధ్వర్యంలో వారు భారతీయ జనతా పార్టీలో చేరారు. వారందరికీ నవీన్‌కుమార్ పార్టీ కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ప్రధాని నరేంద్రమోదీ సుపరిపాలనకు ఆకర్షితులమై తాము బీజేపీలో చేరుతున్నట్లు పలువురు తెలిపారు. అనంతరం నవీన్ కుమార్ బీజేపీ జెండా ఆవిష్కరించారు. బీజేపీలో చేరినవారిలో బీఆర్ఎస్ యూత్ ఉపాధ్యక్షుడు గంద్ర వెంకటేశ్, నాయకుడు మందుల విజయ్, నవతరం యూత్ అధ్యక్షుడు శనిగారపు రాకేశ్, నాయకులు వినయ్, సాయి, గంద్ర శేఖర్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కోరుట్ల నియోజకవర్గం కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు టీవీ శేఖర్, జిల్లా స్పోక్స్ పర్సన్ ఇందూరి తిరుమల, నాయకులు పీసరి నర్సయ్య, మాసం ప్రసాద్, వెంకటి, సుదవేణి మహేశ్, బింగి వెంకటేశ్, పోతుగంటి శ్రీనివాస్, మోలుమూరి రాజమురళి, చిరుమళ్ల ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ జెండా ఆవిష్కరిస్తున్న సురభి నవీన్

వికలాంగుల సమస్యల పరిష్కారానికి కృషి

- టీపీసీసీ డెలిగేట్ జువ్వాడి నర్సింగరావు

కోరుట్ల: వికలాంగుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని టీపీసీసీ డెలిగేట్ జువ్వాడి నర్సింగరావు అన్నారు. ఈమేరకు ఆదివారం వికలాంగుల సంఘం జిల్లా కన్వీనర్ అజీమ్, పలువురు వికలాంగులను జువ్వాడి నర్సింగరావు కలిశారు. వికలాంగులు సమస్యలను టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు.



మాజీ ఎమ్మెల్యే శికారి విశ్వనాథంతో జువ్వాడి నర్సింగరావు

మజీ ఎమ్మెల్యేను కలిసిన జువ్వాడి..

బుగ్గారం మాజీ ఎమ్మెల్యే శికారి విశ్వనాథంను జువ్వాడి నర్సింగరావు ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. రాబోయే ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు, కాంగ్రెస్ ప ట్టణ, మండల అధ్యక్షుడు తిరుమల గంగాధర్ గౌడ్, కొంతం రాజం, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వరి స్థానంలో కూరగాయల సాగు

- స్టేకింగ్ పద్ధతిలో బీర, కాకర, సొరకాయ సాగు
- అభ్యుదయ రైతుల వినూత్న ప్రయోగం



పురుగులను ఆకర్షించే సోలార్ ట్రాప్



రైతులు సాగుచేసిన కాకరకాయ తోట



బీరకాయ తోట

జగిత్యాలఅగ్రికల్చర్: రైతులు ప్రతీ ఏడాది రెండు సీజన్లలో వరిసాగు చేస్తున్నప్పటికీ పెద్దగా ఆదాయం సమకూరడం లేదు. దీంతో అభ్యుదయ రైతులు వినూత్న సాగుకు శ్రీకారం చుట్టారు. వరి సాగు చేసే భూమిలో, రకరకాల కూరగాయలను పండిస్తున్నారు. దీనికి తోడు, ప్రస్తుతం కూరగాయలకు మంచి డిమాండ్ ఉండడంతో, కూరగాయల నాణ్యత చెడిపోకుండా స్టేకింగ్ పద్ధతిలో సాగు చేస్తున్నారు. వీరిని చూసి ఆ గ్రామంలోని మరి కొంత మంది రైతులు సైతం కూరగాయల సాగుకు ఉపక్రమిస్తున్నారు. ఆ రైతులే రాయికల్ మండలంలోని అలూర్ గ్రామానికి చెందిన మెక్కొండ రాంరెడ్డి, నల్లాల తిరుపతి, నల్లాల గంగారెడ్డి.

జూన్ మొదటి వారంలోనే...

ఈ రైతులు ముందుగా జూన్ మొదటి వారంలో సమావేశమై, ఎలాంటి కూరగాయల సాగుచేయాలో నిర్ణయించుకున్నారు. వినియోగదారుల నుంచి డిమాండ్ ఉన్న బీరకాయ, సొరకాయ, కాకరకాయ, టమాట, అలిసెంత వంటి కూరగాయలు సాగుచేయాలనుకున్నారు. దీంతో నాణ్యమైన విత్తనాలను వివిధ కంపెనీల నుంచి కరీంనగర్‌లో కొనుగోలు చేశారు. విత్తనం, కంపెనీని బట్టి 50 గ్రాముల విత్తనాన్నే, రూ. 900కు కొనుగోలు చేశారు. విత్తనం నాటే భూమిలో పశువుల ఎరువువేసి, ట్రాక్టర్‌తో రెండు, మూడుసార్లు బాగా దున్నించారు. తర్వాత, మట్టి బెడ్‌లు తయారుచేసి, వాటిపై సాగునీరందేలా డ్రిప్ పైపులు వేశారు. కలుపు మొక్కలు రాకుండా మల్చింగ్ షీట్ సైతం వేశారు. అనంతరం, మల్చింగ్ షీట్‌కు రంధ్రాలు చేసి, అందులో కరీంనగర్ నుంచి తెచ్చిన విత్తనాలు నాటారు.

నాణ్యత దెబ్బతినకుండా స్టేకింగ్

కూరగాయల నాణ్యత దెబ్బతినకుండా కంక బొంగులతో స్టేకింగ్ ఏర్పాటు చేశారు. ఇందుకోసం, తీగజాతీ కూరగాయలైన సొరకాయ, కాకరకాయ, బీరకాయలు నేలపై పారితే ముడుచుకుపోయి, మార్కెట్‌లో రేటు ఉండదు. దీంతో మొక్కలకు తీగ పారగానే, తీగకు సుతిల్‌తో కట్టి, కంక బొంగులకు పాకించడం చేస్తున్నారు. దీంతో మొక్కకు సరైన గాలి, సూర్యరశ్మి తగిలి మొక్క ఏపుగా పెరుగుతుంది. మొక్కకు పెద్దగా పురుగులు, తెగుళ్లు ఆశించే అవకాశం ఉండదు.

పురుగు మందులు కొట్టకుండా... సోలార్ ట్రాప్‌లు..

సాధారణంగా కూరగాయల పంటలను పూత, పిందె దశలో పురుగులు ఎక్కువగా ఆశిస్తాయి. దీంతో, రైతులు రకరకాల పురుగు మందులు పిచికారీ చేస్తుంటారు. కానీ, ఈ రైతులు సమాజ శ్రేయస్సే కోసం పురుగుమందులు వాడకుండా పురుగులను ఆశించే సోలార్ ట్రాప్‌లు, పండు ఈగ ఆకర్షక బుట్టలు పెడుతున్నారు. మొక్కలు బలంగా పెరిగేందుకు యూరియా, డీఏపీ వంటి రసాయన ఎరువులు వేయకుండా, మజ్జిగ, బెల్లంతో కూడిన పుల్లటి పదార్థాన్ని మొక్కలకు అందిస్తున్నారు.

మార్కెట్‌కు కూరగాయలు...

తమ పొలంలో పండించిన కూరగాయలను జగిత్యాలతో పాటు రాయికల్‌కు తరలిస్తున్నారు. అయితే కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో ఇప్పుడిప్పుడే పంట చేతికి అందుతుంది. కాబట్టి రైతుల పొలాల్లో కూరగాయల పంట దిగుబడులు సెప్టెంబర్ వరకు కొనసాగే అవకాశం ఉంది. ప్రస్తుతం కూరగాయలకు మంచి డిమాండ్ ఉండడంతో, తమకు కలిసి వస్తుందని రైతులు ఆశిస్తున్నారు. కూరగాయలు సాగుచేసే రైతులకు సబ్సిడీపై విత్తనాలు డ్రిప్, మల్చింగ్ పరికరాలు అందించాలని రైతులు కోరుతున్నారు.

తీగ జాతి కూరగాయలు సాగు చేశా



నేను 25 గుంటల్లో సొరకాయ, కాకరకాయ, బీరకాయ వంటి తీగజాతి కూరగాయలు సాగు చేశాను. పంట బాగుంది. అయితే, కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తుండడంతో పిందె ఆగిపోయింది. అయినప్పటికీ మంచి దిగుబడులు వస్తాయని ఆశిస్తున్నాను. – మెక్కొండ రాంరెడ్డి, అలూరు

అన్ని కూరగాయలను సాగు చేశా



తీగజాతి కూరగాయలతో పాటు టమాట, గోరు చిక్కుడు, గోపిగడ్డ వంటి రకాలను సాగుచేశాను. పంటలు బాగున్నాయి. ఇప్పుడిప్పుడే మార్కెట్‌కు వస్తున్నాం. రేటు కూడా కలిసి వచ్చే అవకాశం ఉంది.

– నల్లాల తిరుపతి, అలూర్

పురుగు మందులు వాడలేదు



పెద్దగా పురుగు మందులు, రసాయన ఎరువులు వాడం. సేంద్రియ పద్ధతిలో పంటలు సాగుచేస్తూ పురుగులను అదుపులో పెడుతున్నాం. నాణ్యమైన విత్తనాలను కరీంనగర్ నుంచి తెచ్చి బెడ్ పద్ధతిలో సాగుచేశాం. మంచి లాభాలు వస్తాయని ఆశిస్తున్నాం.

– నల్లాల గంగారెడ్డి, అలూర్

తల్లిదండ్రులు మందలించారని ఆత్మహత్య

- కిష్టునాయక్‌తండాలో విషాదం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎప్పుడు ఫోన్‌లో యూట్యూబ్ చూడొద్దని బాగా చదువుకోవాలని తల్లిదండ్రులు మందలించడంతో మనస్థాపానికి గురైన విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం కిష్టునాయక్‌తండాలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. విద్యార్థి మృతిఘటన తండాలో విషాదం నింపింది. పోలీసులు తెలిపిన వివరాలు. మాలోతు రేణ–ప్రశాంత్ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు ఉదయ్(11) రాజన్నపేటలోని ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు సెలవు దినం కావడంతో ఉదయ్ ఇంటి వద్ద ఉండగా తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లారు. పనులు ముగించుకొని ఇంటికొచ్చిన వారికి ఉదయ్ కనిపించలేదు. రాత్రి పొద్దుపోయే వరకు గా లించారు. ఇంట్లోని వంట గదికి గడియ పెట్టి ఉండడంతో అనుమానం వచ్చి తలుపులు పగులగొట్టి చూడగా గోడమేకుకు లుంగితో మెడకు చుట్టుకొని ఉరేసుకొని ఉన్నా డు. కొనఊపిరితో ఉన్న ఉదయ్‌ని ఎల్లారెడ్డిపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించా డు. యూట్యూబ్ చూడొద్దని చదువుకోవాలని మందలించిన పాపానికి చెట్టంతా కొడుకు మమ్మల్ని విడిచి వెళ్లాడని ఆ దంపతుల రోదనలు అందరిని కలచివేశాయి. మృతుడి తండ్రి ప్రశాంత్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఉదయ్(ఫైల్)

రోడ్డుపై పడి వ్యక్తి మృతి

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని ముచ్చర్ల తండాకు చెందిన భూక్య రవి తన ఇంటి ముందున్న సీసీరోడ్డుపై నిల్చొని ఉన్నట్టుండి తలతిరిగి రోడ్డుపై పడ్డాడు. తీవ్ర గాయాలపాలైన రవి అసస్మారక స్థితికి చేరడంతో స్థానికులు సిరిసిల్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన రవి చదువు మధ్యలో ఆపేసి కూలీపనులు చేస్తున్నాడు. రవికి భార్య మునిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తండావాసులు కోరుతున్నారు.

చేపలవేటకు వెళ్లి వ్యక్తి మృతి

ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని కందికట్కూర్ గ్రామానికి చెందిన దేవరకొండ నరేశ్ (39) అనే వ్యక్తి అదే గ్రామ సమీపంలోని మానేరువాగులో చేపలు పట్టేందుకు వెళ్లి నీటిలో పడి ఈత రాకపోవడంతో మృతిచెందాడు. శనివారం మధ్యా హ్నం మృతుడు నరేశ్ మానేరువాగులో చేపలు ప ట్టేందుకు వెళ్లి నీటిలో పడిపోగా మృతదేహం ఆదివారం మధ్యాహ్నం నీళ్లలో తేలిందని, గమనించిన గ్రామస్తులు వెంటనే మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచా రం అందించారు. ఎస్సై రాజేశ్ ఘటనా స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య జాన్సీ, కుమారుడు చరణ్ ఉన్నారు.